క్లుప్తంగా

నేడు జాబ్‌మేళా

ధవళేశ్వరం: స్థానిక వివేకానంద ఐటీఐలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఏసీ మాన్యుఫ్యాక్చరింగ్, టైర్ మ్యానుఫ్యాక్చరింగ్, హోండాయ్ మోబీస్, ఎస్‌వీహెచ్, ఇసుజు మోటార్స్, కేఐఎంఎల్, సియోన్ తదితర సంస్థల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఐటీఐ, డిప్లమో, బీటెక్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన 30 ఏళ్లలోపు వారు అర్హులు. జీతం నెలకు సుమారు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుంది. ఆసక్తి, అర్హత కలిగిన వారు బుధవారం ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జిరాక్సులతో ఇంటర్వ్యూకు హాజరుకావాలి.

దుస్తుల పంపిణీ

కడియం: వీరవరం గ్రామ పారిశుద్ధ్య కార్మికులకు జనసేన నాయకులు మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. ఆ పార్టీ నాయకుడు ఆదిమూలం సాయిబాబా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

దాడి ఘటనలో ముగ్గురికి జైలు

కంబాలచెరువు: చాకుతో దాడి చేసిన ఘటనలో ముగ్గురికి జైలు శిక్ష విధిస్తూ ఫస్ట్ అడిషనల్ అసిస్టెంట్ సీనియర్ జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు. సుబ్బారావు నగర్‌కు చెందిన దాసరి మీరా సాహెబ్ 2019 జులై 28న జాంపేటలో ఒక ఫంక్షన్‌కు వెళ్లాడు. ఆటోలో వెళ్లిన అతడితో పాత గొడవల నేపథ్యంలో తిరగాటి సత్తిబాబు, తిరగాటి దుర్గ, సిద్ధార్థ నగర్‌కు చెందిన దుప్పాడ రవణమ్మ గొడవ పడ్డారు. ఈ నేపథ్యంలో ఆటో అద్దాలు పగలకొట్టి, చాకుతో మీరా సాహెబ్ మెడపై గాయపర్చారు. అడ్డు వచ్చిన అతడి భార్యపైనా దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. నేర నిరూపణ కావడంతో సత్తిబాబుకి ఐదేళ్ల జైలు, రూ.500 జరిమానా, దుర్గ, రవణమ్మకు రెండేళ్ల జైలు, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కేసును పీపీ జి.వెంకటరత్నంబాబు వాదించారు. ప్రస్తుత ఇన్‌స్పెక్టర్ జి.మధుబాబు సాక్షులను ప్రవేశ పెట్టారు.

యువతి మృతదేహం లభ్యం

కంబాలచెరువు: స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని యువతి (23) మృతదేహం మంగళవారం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు దోబీఘాట్ వద్ద గోదావరిలో ఉన్న మృతదేహాన్ని పోలీసులు బయటకు తీశారు. ఆమె వివరాలు తెలియలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

లారీ ఢీకొని యువకుడి మృతి


గంగరాజు (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: లారీ అతివేగంగా ఢీకొనడంతో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి 10.40 గంటల సమయంలో బొమ్మూరు గ్రామంలో రాఘవేంద్రకాలనీ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం రాజానగరం మండలం పాత నామవరం గ్రామానికి చెందిన జుత్తుక అనిల్‌కుమార్, గెడ్డం గంగరాజు(18) బంధువుల యువకుడుని మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు ట్రైన్ ఎక్కించేందుకు వచ్చారు. రాత్రి 10.30 గంటల సమయంలో బొమ్మూరు మీదుగా పాత నామవరం వెళుతుండగా రాఘవేంద్రనగర్‌కాలనీ వద్దకు వచ్చేసరికి ఇసుకలోడు లారీ అతివేగంగా ఢీకొట్టింది. గెడ్డం గంగరాజు తలపై టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అనిల్‌కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. లారీ డ్రైవరు వేగంగా వెనక్కి తీసుకుని వెళ్లే ప్రయత్నం చేయగా స్థానికులు అడ్డుకోవడంతో లారీని వదిలి డ్రైవర్ పరారయ్యాడు. సంఘటన స్థలాన్ని బొమ్మూరు ఎస్సై శివాజీ పరిశీలించి మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆధారం కోల్పోయిన కుటుంబం..

గెడ్డం గంగరాజు తండ్రి అబ్రహం రెండేళ్ల క్రితం చనిపోవడంతో తాపీ పనిచేస్తూ తల్లి బుజ్జిని పోషిస్తున్నాడు. ఇద్దరు అక్కలకు పెళ్లిళ్లు అయిపోయాయి. లారీ ఢీకొట్టిన సంఘటనలో గంగరాజు మృతితో పాతనామవరం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అతని మృతదేహం వద్ద స్నేహితులు, కుటుంబసభ్యులు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

సీఎం జగన్ దృష్టికి పౌల్ట్రీ రంగ సమస్యలు

అనపర్తి: కొంతకాలంగా పౌల్ట్రీ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిసి విన్నవించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధిదారులతో మంగళవారం రాజమహేంద్రవరంలో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎమ్మెల్యే సమక్షంలో ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు కేవీ ముకుందరెడ్డి కలిసి పౌల్ట్రీ రంగ సమస్యలను విన్నవించడంతోపాటు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి భారీగా అభిషేకాలు

బిక్కవోలు: మండలంలోని శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి జన్మ నక్షత్రం కృత్తిక కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. 412 అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.


సీఎం జగన్ రాక కోసం ఎదురు చూస్తున్న ఆశవర్కర్లు


సీఎం జగన్‌కు వరికుచ్చు అందజేస్తున్న గిరజాల బాబు


పెదబాబును వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న సీఎం జగన్

అడుగడుగునా ఆత్మీయ స్వాగతం

- ముఖ్యమంత్రి జగన్‌కు నీరాజనం
- భారీగా తరలివచ్చిన ప్రజలు
- కిక్కిరిసిన రోడ్లు

రాజమహేంద్రవరం సిటీ/ సీటీఆర్ఐ: రాజమహేంద్రవరం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంగళవారం నగరంలోని అడుగడుగునా ఆత్మీయ ఆదరణ లభించింది. వీధులన్నీ జనంతో నిండిపోయాయి. ఎక్కడ చూసినా జన గోదారిని తలపించాయి. సీఎం నగరంలో అడుగు పెట్టినప్పటికి నుంచీ అడుగడుగునా ప్రజలు పూలవర్షం కురిపించారు. ఆయన కోసం ఉదయం నుంచే దారిపొడవునా ఎదురు చూశారు. మున్సిపల్ స్టేడియంలో ల్యాండ్ అయి ఆర్ట్స్ కళాశాలలోని సభా ప్రాంగణానికి వెళ్లేవరకూ నీరాజనాలు పలికారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. దాబాలపై నుంచి, అపార్ట్‌మెంట్ నుంచి పూలవర్షం కురిపించారు. నగరంలో ఎటూ చూసిన జన సందోహం కనిపించింది.

కళాప్రదర్శనలు

సీఎం జగన్ కాన్వాయ్ వచ్చే దారిపొడవునా కళాప్రదర్శనలు ఏర్పాటు చేశారు. నాగుల చెరువు బజార్, శ్యామల సెంటర్, నందం గనిరాజు జంక్షన్, వై.జంక్షన్‌లో రాధాకృష్ణ నృత్యకళానికేతన్‌కు చెందిన 45 మంది విద్యార్థులు ప్రదర్శనలు చేశారు. కళాకారులు గరగలు, తప్పెట గుళ్లు, మంగళ వాయిద్యాలు, సన్నాయి మేళాలతో స్వాగతం పలికారు.

టీడీపీ నాయకుల అరెస్టు

అప్సర థియేటర్ సమీపంలోని సోమాలమ్మ ఆలయం వద్ద తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు తదితరులు ముఖ్యమంత్రి జగన్ పర్యటనను నిరసిస్తూ కార్యక్రమం చేపట్టారు. దీంతో వారిని పోలీసులు అరెస్టు చేసి ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.


సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీ భరత్ రామ్


జక్కంపూడి విజయలక్ష్మి ఆరోగ్యంపై రాజాతో మాట్లాడుతున్న సీఎం జగన్




హెలిప్యాడ్ వద్ద సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ మాధవీలత, కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్

థ్యాంక్యూ సీఎం సార్

నందం గనిరాజు జంక్షన్‌లో థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ఆశ వర్కర్లు ప్లకార్డులు ప్రదర్శించారు. తమ జీతం రూ.పదివేలు పెంచి, తమకు ఆర్థిక భరోసా కల్పించారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో స్వచ్ఛందంగా తరలివచ్చి సీఎం జగన్ కాన్వాయ్ వెళ్లే మార్గంలో ప్లకార్డులతో కృతజ్ఞతలు తెలిపారు.

భారీ బైక్ ర్యాలీ

ఎంపీ కార్యాలయం నుంచి పెద్దసంఖ్యలో యువత ఆర్ట్స్ కాలేజీ వరకూ భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. జగనన్నకి జై అంటూ సుమారు 400 బైక్‌లతో యువత కేరింతలు కొడుతూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో జక్కంపూడి గణేష్, బొంతా శ్రీహరి, అనుసూరి పద్మలత, నందెపు శ్రీనివాస్, ఎండీ ఆరీఫ్, విశ్వేశ్వరరెడ్డి, కానుబోయిన సాగర్, గుర్రం గౌతమ్, గిరజాల బాబు, మిండే నాగేంద్ర, బిల్లర్ చిన్నా, అజ్జరపు వాసు, కొండబాబు, పోలు విజయలక్ష్మి, మార్తి లక్ష్మి, మజ్జి అప్పారావు, రజనీ కాంత్ పాల్గొన్నారు.

లబ్ధిదారులతో ముచ్చటించిన సీఎం జగన్

ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తిలకించారు. అక్కడ ఉన్న ప్రజల సమస్యలు విన్నారు. తన భర్త ఇటీవల మరణించారని, వలంటీర్ స్వయంగా వచ్చి వివరాలు తెలుసుకుని వెంటనే పెన్షన్ ఇవ్వడం జరిగిందని ముఖ్యమంత్రికి వివరించారు నామవరానికి చెందిన వితంతు పింఛన్ లబ్ధిదారురాలు కాసాని దుర్గా శ్రీదేవి. తనకు ఇద్దరు అమ్మాయిలని, వారిని పెంచుకోవడానికి ఏదైనా ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి చేసింది. కోరుకొండ మండలం మధురపూడికి చెందిన కల్లు గీత కార్మిక వర్గానికి చెందిన బాలిన దుర్గా ప్రసాద్‌కి ఉద్యోగం కోసం విన్నవించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి జిల్లా కలెక్టర్ కె.మాధవీలతకి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధవళేశ్వరానికి చెందిన ట్రాన్స్‌జెండర్ సౌందర్య ఇంటి స్థలం కోసం, శ్రీరంగపట్నానికి చెందిన కళాకారుడు సరకానం అప్పలరాజు కళాకారుల పింఛన్‌ను రూ.5 వేలకు పెంచాలని, రాజమహేంద్రవరం 34వ డివిజన్‌కి చెందిన దివ్యాంగురాలు కాసర్ల జయదుర్గ ఉపాధి రుణం కోసం విజ్ఞప్తి చేశారు.

విజయలక్ష్మి ఆరోగ్యంపై ఆరా

అమ్మ ఆరోగ్యం ఎలా ఉందంటూ వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాని సీఎం జగన్ అడిగి తెలుసుకున్నారు. అలాగే రాజానగరం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను, గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమ వివరాలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా వివరించారు.

వరికుచ్చు అందజేత

కడియం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మున్సిపల్ స్టేడియంలో హెలిప్యాడ్ వద్ద వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల వీర్రాజు మర్యాదపూర్వకంగా కలిసి, వరికుచ్చు అందజేశారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ కార్పొరేటర్ (33వ డివిజన్) గాదిరెడ్డి నరసింహారావు (పెదబాబు) మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మంగళవారం మున్సిపల్ స్టేడియంలో హెలిప్యాడ్ వద్ద ఎంపీ మార్గాని భరత్ రామ్ పెదబాబును సీఎంకు పరిచయం చేశారు. పెదబాబు నిర్ణయాన్ని ఎంపీ భరత్ సీఎం జగన్‌కు తెలిపారు. వెంటనే సీఎం జగన్ పెదబాబును అభినందించి, సాదరంగా వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు.

భారీగా తరలివెళ్లిన పార్టీ శ్రేణులు

కడియం: రాజమహేంద్రవరంలో జరిగిన సీఎం జగన్ బహిరంగ సభకు మండలంలోని గ్రామాల నుంచి భారీగా పార్టీ శ్రేణులు తరలివెళ్లాయి. కడియం, వేమగిరి, జేగురుపాడు, కడియపులంక, దుళ్ల, కడియపుసావరం, పొట్టిలంక, మురమండ గ్రామాల నుంచి కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వెళ్లారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, పార్టీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, మాజీ సర్పంచ్ వెలుగుబంటి వెంకటాచలం తదితరులు ఆయా గ్రామాల్లో పార్టీ శ్రేణులు తరలివెళుతున్న వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు.

సావిత్రీబాయి పూలే ప్రపంచానికే ఆదర్శం


సావిత్రీబాయికి నివాళులర్పిస్తున్న ఎంపీ భరత్ రామ్


డైట్ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం


ఎస్‌కేఆర్ కళాశాలలో పూలే దంపతులకు నివాళి

- ఎంపీ మార్గాని భరత్ రామ్
- ఘనంగా జయంత్యుత్సవం

రాజమహేంద్రవరం రూరల్: సావిత్రీబాయి పూలే గొప్ప మహిళామూర్తి, భారతదేశ తొలి గురువు, ఆమె ప్రపంచానికే ఆదర్శమూర్తి అని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. వీఎల్‌పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో మంగళవారం సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ఎంపీ భరత్, బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో మార్గాని చంటిబాబు, కడలి వెంకటేశ్వరరావు, మార్గాని సురేష్, ఆచంట అనసూయ తదితరులు పాల్గొన్నారు.

సేవలు స్ఫూర్తిదాయకం

రాజమహేంద్రవరం రూరల్: సావిత్రీబాయి పూలే సేవలు నేటితరానికి స్ఫూర్తిదాయకమని జిల్లా విద్యాశిక్షణాసంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం అన్నారు. బొమ్మూరులోని డైట్ కళాశాలలో సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకుని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మహిళల చదువు కోసం ఆమె ఎంతో కృషి చేశారన్నారు. డైట్ అధ్యాపకుడు కొమ్ముల వెంకట సూర్యనారాయణ మహిళా అధ్యాపకులు, మహిళా బోధనేతర సిబ్బంది చిత్రాలతో తయారు చేసిన డైట్ బొమ్మూరు క్యాలెండర్ ఆకట్టుకుంది. కార్యక్రమానికి అధ్యాపకురాలు సుజాతారత్నం సమన్వయకర్తగా వ్యవహరించారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

- కాతేరు బీసీ కాలనీలో సావిత్రీబాయి పూలే జయంతిని డాక్టర్ చప్పిటి మూర్తి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రొంగల గోపీ శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు యానాపు ఏసు మాట్లాడుతూ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయులు, రచయిత్రిగా ఆమె నిమ్నవర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. భీమవరపు సూరిబాబు, సిద్దాని వెంకట్, బండారు అప్పారావు, కిల్లా రాజు, పెండ్యాల నాగేశ్వరరావు, కాతేరు గ్రామ జ్యోతిరావు పూలే సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో వేడుకలు

ప్రకాశం నగర్: సావిత్రీబాయి పూలే జయంతిని నగరంలో ఘనంగా నిర్వహించారు. ఏపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఎంప్లాయిస్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షుడు మర్రి బాబ్జీ అధ్యక్షతన జయంతి నిర్వహించారు. పూలే దంపతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ ముఖ్య సలహాదారు సీహెచ్ సుబ్బారావు, కాశి నవీన్ కుమార్, టి.కృష్ణంరాజు, తాళ్లూరి బాబూ రాజేంద్ర ప్రసాద్, కోరుకొండ చిరంజీవి, కొంకి రమేష్ పాల్గొన్నారు.

- కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా డీఈడీ కళాశాలలో పూలే దంపతుల చిత్రపటానికి కళాశాల సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ సీహెచ్ విజయభాను మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం పోరాడిన పుణ్యమూర్తి సావిత్రీబాయి పూలే అని కొనియాడారు. కళాశాల తెలుగు అధ్యాపకురాలు ఎం.విశాలాక్షి, సూపరింటెండెంట్ టి.ఝాన్సీ పాల్గొన్నారు.


వేంకటేశ్వరాలయంలో దీపోత్సవం

విశేష దీపోత్సవం

కడియం: దుళ్లలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం విశేష దీపోత్సవం నిర్వహించారు. ఆలయంలో ధనుర్మాస పూజలు విశేషంగా జరుగుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో 19వ రోజున ఈ విశేష దీపోత్సవం నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు పెద్దింటి లక్ష్మణాచార్యులు తెలిపారు. కార్యక్రమానికి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు.

రెండు తాటికిళ్లు దగ్ధం


పెదపూడిలో అగ్నిప్రమాదంలో కాలిపోయిన ఇళ్లు

- రూ.4.50 లక్షల ఆస్తి నష్టం

పెదపూడి: స్థానిక కావమ్మ చెరువు సమీపంలో అగ్ని ప్రమాదం సంభవించి రెండు తాటికిళ్లు దగ్ధమయ్యాయి. తహసీల్దార్ టి.సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో అమలదాసు మంగ, గాడ దుర్గ అనే రెండు కుటుంబాలు పక్కపక్కనే తాటకిళ్లలో జీవిస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు వ్యాపించి రెండు ఇళ్లు దగ్ధమయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. రెండు మోటార్ సైకిళ్లు, టీవీలు, ఫ్రిజ్, కాలిపోయాయి. బాధిత కుటుంబాన్ని తహసీల్దార్ సుభాష్, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, ఆర్ఐ త్రివేణి, వీఆర్వో సునీత పరామర్శించారు. 20 కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు రూ.26 వేల ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే


బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: అగ్ని ప్రమాద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి గ్రామంలో అగ్ని ప్రమాద బాధితులను మంగళవారం ఎమ్మెల్యే పరామర్శించారు. పార్టీ నాయకులు సమకూర్చిన రూ.26వేలు, సుమారు రూ.10వేలు విలువగల బియ్యం నిత్యావసర సరుకులను రెండు బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా బాధితులకు వర్తించే పథకాలన్నీ వెంటనే అందించడానికి కృషి చేస్తానన్నారు. ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, గ్రామ కన్వీనర్ మీసాల నాగరాజు పాల్గొన్నారు.

నూతనంగా 421 పెన్షన్ల మంజూరు

అనపర్తి: అధికారంలోకి వచ్చిన తరువాత దశలవారీగా రూ.250 చొప్పున పింఛను మొత్తాన్ని పెంచుతూ రూ.3 వేలు చేస్తానన్న హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడో ఏడాది అమలు చేశారు. దీంతో 2023 నూతన సంవత్సర కానుకగా ఈ నెల నుంచి పింఛన్‌ను రూ. 2,750 కు పెంచారు. వైఎస్సార్ పింఛను కానుక పేరుతో ఇప్పటికే మండలంలో 9,750 మందికి పెన్షన్ అందజేస్తున్నారు. ఈ ఏడాది నూతనంగా మరో 421 మంది లబ్ధిదారులకు పింఛన్లు మంజూరయ్యా యి. దీంతో మొత్తం 10,171 మందికి ప్రభుత్వం పింఛను కానుకను అందజేయనుంది .

హిందూ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాలి


రంగంపేటలో భజన సమాజ గురువులను సత్కరించిన నిర్వాహకులు

రంగంపేట: భజన పాటల ద్వారా దైవభక్తిని ప్రతి ఒక్కరిలో కలిగించి హిందూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడటంలో భజన సమాజాలు కృషి చేయాలని విఘ్నేశ్వర భజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దువ్వా అచ్చారావు పిలుపునిచ్చారు. స్థానిక అలివేలుమంగా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా భజన గురువుల సత్కార సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శ్రీదేవి బాల భక్త భజన సమాజ సంఘం గురువు, గ్రామ మాజీ ఉప సర్పంచ్ పోతుల వీర సుందరరావు ప్రసంగించారు. సూర్యనారాయణపురం గ్రామానికి చెందిన ఉప్పలపల్లి పెద వీరభద్రంకు, రంగంపేటకు చెందిన భజన గురువు కొనుజుల వెంకయ్య స్మారక అవార్డును ప్రదానం చేసి సత్కరించారు. భజన గురువులు మావిరెడ్డి నెహ్రూ, జగతం వీరవెంకట సత్యనారాయణ, ఆలయ అర్చకుడు దేవరబట్ల శిరిడీ సాయి శర్మలను గ్రామ పెద్దలు కంటిపూడి ఆనందరావు, మావిరెడ్డి వీర్రాజు, శ్రీను మాస్టరు సత్కరించారు. స్వర్గీయ పోతుల అబ్బాయి స్మారకార్థం ఏకాహ భజనలు ప్రారంభించామని నిర్వాహకుడు పోతుల వీర సుందరరావు తెలిపారు.

రాముని సన్నిధి.. త్యాగరాజస్వామి పెన్నిధి

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అనపర్తి: తనను కోరి వచ్చిన లౌకిక సంపదలను విడిచిపెట్టి శ్రీరామచంద్రమూర్తి ఉపాసన చేస్తూ రామ తత్వాన్ని అనుభవించి వాటిని కీర్తనల రూపంలో లోకానికి అందించిన భాగవతోత్తముడు త్యాగరాజస్వామి అని ప్రవచన చక్రవర్తి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. తన అసమాన ప్రతిభతో కర్నాటక సంగీత ప్రపంచంలో నూతన శకాన్ని స్థాపించి, కర్నాటక సంగీత గురు సంప్రదాయాన్ని సుస్థిరం చేసిన త్యాగరాజస్వామి వారి ఆరాధనోత్సవాలు స్థానిక టీటీడీ కల్యాణ మంటపంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. అనపర్తి శ్రీ శారదా సంగీత కళాసమితి ఆధ్వర్యంలో ఎనిమిది రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాలను తొలిరోజు చాగంటి కోటేశ్వరరావుతోపాటు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం చాగంటి 'భక్తి వైభవం'పై ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తూ భక్తుడిని భగవంతుడుకి దగ్గర చేసే మార్గం భక్తి మార్గమని అన్నారు. రామనామం జపించిన అనుగ్రహంతో శ్రీరామచంద్రమూర్తి సాక్షాత్కారాన్ని పొందిన త్యాగరాజస్వామి మనస్సు దారి తప్పకుండా, మనిషి ఉత్తమ పథంలో ప్రయాణం చేసేందుకు అవసరమైన తన కీర్తనల ద్వారా మానవాళికి మార్గదర్శనం చేశారని తెలిపారు. 23 సంవత్సరాలుగా శ్రీ శారదా సంగీత కళాసమితి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ప్రముఖ నేత్ర వైద్యులు తేతలి సత్యనారాయణరెడ్డి, తేతలి రాధాకృష్ణారెడ్డి, అమ్మిరెడ్డి ఆయిల్స్ అధినేత సబ్బెళ్ల అమ్మిరెడ్డి, మారెళ్ల గంగరాజుశర్మ, సత్తి రామారెడ్డి, ఎన్‌సీఆర్ భాస్కర రెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి, డాక్టర్ టి.రామగుర్రెడ్డి, సమితి ప్రతినిధులు తమలంపూడి చిన్న ఆదిరెడ్డి, నల్లమిల్లి మురళీమోహనబాలకృష్ణారెడ్డి, నల్లమిల్లి మునీశ్వరరెడ్డి, రఘు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగించి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ప్రముఖులు